క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసి ఉన్న శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శనివారం శ్రావణ నక్షత్రం సందర్భంగా వేకువజాము నుంచే స్వామి వారికి ప్రత్యేక అభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. ఆలయ పూజారి పెంచలయ్యస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

దివ్యాంగులకు దుస్తులు పంపిణీ

ప్రొద్దుటూరు: మండలంలోని అమృతానగర్‌లో శనివారం పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా 17వ వార్డు మెంబర్ బీబీజాన్, ఆమె భర్త హుస్సేన్, కుమారుడు అల్లాబకాష్ దివ్యాంగులకు నూతన దస్తులను పంపిణీ చేశారు. వీటిని ఎంపీటీసీ డిష్ శ్రీను చేతుల మీదుగా దివ్యాంగులకు అందించారు. సొసైటీ గౌరవాధ్యక్షుడు వై.చలపతిరావు, వలంటీర్ బావమ్మ, సావిత్రి, మల్లేశ్వరి, సంజీవ్ కుమార్, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ కార్యక్రమం

ప్రొద్దుటూరు : నెహ్రూ యువకేంద్రం, వికసిత ఫౌండేషన్ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంస్కృతి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత కోచింగ్

ప్రొద్దుటూరు కల్చరల్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పాలిసెట్‌కు ఈనెల 16 నుంచి ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు జేవీవీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ వీవీ శివారెడ్డి, ఎన్.సునీత తెలిపారు. పాలిసెట్ ఉచిత కోచింగ్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి చదివిన విద్యార్థులకు స్థానిక నందిని క్లాత్ మార్కెట్‌లోని జేవీవీ కార్యాలయంలో అత్యుత్తమ ఫ్యాకల్టీతో ఉచితంగా పాలిసెట్ కోచింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అలాగే 9705432038కు ఫోన్ చేసి ఎన్‌రోల్ చేసుకోవాలని సూచించారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

దువ్వూరు : మండల కేంద్రమైన దువ్వూరులోని మకాం వీధిలో నలుగురు జూదరులను అరెస్టు చేసిన ఎస్ఐ రాఘవేంద్రారెడ్డి శనివారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.54,100 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే మండలంలోని ఐ.బయనపల్లె గ్రామంలో జూదమాడుతున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.4,200 స్వాధీనం చేసుకున్నామన్నారు. తెలిపారు. కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

అన్నదానం

పోరుమామిళ్ల: రామాయపల్లె ఎస్టీ కాలనీలో పేద కుటుంబాలకు శ్రీ జ్ఞాన సరస్వతీదేవి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం అన్నదానం, మజ్జిగ పంపిణీ జరిగింది. అన్నమయ్య జిల్లా పీవీజీపల్లెకు చెందిన తరిగోపుల రాము కుమారుడు భార్గవరాము పుట్టినరోజు సందర్భంగా వారు ఈ అన్నదానం చేశారని ట్రస్టు వ్యవస్థాపకులు శ్రీనివాసులు తెలిపారు. ట్రస్టు రాయలసీమ ఇన్‌చార్జి డా.పోలయ్య, జిల్లా అధ్యక్షులు రాజేష్‌కుమార్, సభ్యులు పిచ్చయ్య, చంద్ర, నరసింహ పాల్గొన్నారు.

రేపు ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు : మండల పరిధిలోని పెద్దగురువలూరు గ్రామ పంచాయతీలో సోమవారం ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామంలో 104 వాహనం ద్వారా ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రామంలోని ప్రజలందరికి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులను పంపిణీ చేస్తామని ఆయన వివరించారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వసతులు కల్పించాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ఎండల తీవ్రత అధికంగా ఉందని పదో తరగతి మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయులకు మెరుగైన వసతులను కల్పించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్, కడప అన్నమయ్య జిల్లా అధ్యక్షులు రామసుబ్బయ్య, సీవీప్రసాద్ కోరారు. ప్రతి గదిలో ఫ్యాన్లు , కూల్ వాటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. పెరిగిన రేట్లను అనుగుణంగా రెమ్యూనరేషన్ పెంచాలని డిమాండ్ చేశారు. గూగుల్ ఫామ్ నింపిన వారికి భత్యాలు ఉండవన్న అనుమానాలను విద్యాశాఖ అధికారులు నివృత్తి చేయాలని కోరారు.

పరీక్షలు అయిపోయాయోచ్



'పరీక్షలు ఎలా రాశావ్.. నేను బాగా రాశా' ఒకరినొకరు మాట్లాడుకుంటున్న విద్యార్థులు



పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

- విద్యార్థుల్లో ఆనందం
- భవిష్యత్తు బాటలో విద్యార్థులు

రాజుపాళెం : పదవ తరగతి పరీక్షలు శనివారంతో ముగిశాయి. చివరిరోజు విద్యార్థులు పరీక్ష కేంద్రాల నుంచి ఉత్సాహంగా బయటకు వచ్చారు. అనంతరం పరీక్ష కేంద్రం వద్దే కాసేపు తమ మిత్రులతో కలిసి ఆనందంగా గడిపారు. పరీక్ష ఎలా రాశావని ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు బాగా రాశామని ఒకరు.. అధిక మార్కులతో పాస్ అవుతామని మరొకరు.. ఇంటర్ ఎక్కడ్రా.. అని ఇంకొకడు.. ఇలా ఒకరినొకరు ఉత్సాహంగా చర్చించుకోవడం విశేషం. ఇకపై ఎప్పుడు కలుస్తామోనని కొందరు బాధతో బైబై చెప్పుకుంటూ వెళ్లారు. కాగా రాజుపాళెం మండలంలోని 8 జెడ్పీ ఉన్నత, మూడు ప్రైవేటు, వెల్లాలలోని బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులంతా రాజుపాళెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏ,బీ అనే రెండు సెంటర్లలో మొత్తం 325 మంది పరీక్షలు రాశారు.

రంజాన్ తోఫా పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని వికాస్ విహార్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు నెల్లూరుకు చెందిన సేహత్ మంద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ చేశారు. డాక్టర్ సిరాజుద్దీన్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు చీరలు, రూ.1000 ఆర్థిక సహాయాన్ని ఫౌండేషన్ చైర్మన్ నిజాముద్దీన్ అందించారు. పిల్లలకు బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఝాన్సీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

గోపవరం : జగనన్న ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం .నాగరాజ పేర్కొన్నారు. శనివారం మండలంలోని రాచాయపేట జగనన్నకాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జగనన్న ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి వారం వారం టార్గెట్‌లు ఇవ్వడం జరిగిందని, గడువులోపు పనులు పూర్తి కావాలన్నారు. ప్రత్యేకాధికారి వెంట ఏఓ అరవిందనాయక్ ఉన్నారు.

ఇంటింటా జగన్నినాదం



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలో జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమం జోరుగా సాగుతోంది. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆదేశాల మేరకు ఈనెల 7 నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదట ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి 40వ వార్డులో కార్యక్రమాన్ని ప్రారంభించగా మున్సిపాలిటీ పరిధిలో వార్డు కౌన్సిలర్లు, గ్రామాల్లో ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, పార్టీ శ్రేణులు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు ప్రతి గడపకు వెళ్లి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు ప్రభుత్వ పరిపాలన ఎలా ఉంది, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకుంటున్నారు. కుటుంబ సభ్యులు 8296082960కు మిస్డ్‌కాల్ చేసి తమ మద్దతు తెలుపుతున్నారు. పట్టణ వార్డు సచివాలయాల ఇన్‌చార్జి పోసా భాస్కర్, కాకర్ల నాగేశ్వరరెడ్డి, రూరల్ మండల ఇన్‌చార్జి కల్లూరు నాగేంద్రారెడ్డి జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు.

నిత్యావసర వస్తువులు పంపిణీ



ఆశ్రమానికి నిత్యావసర వస్తువులు ఇస్తున్న సేవా సంస్థ సభ్యులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి వృద్ధాశ్రమానికి ఆర్‌కే హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ వారి సహకారంతో మీకోసం సేవా సంస్థ శనివారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేసింది. ఈ వస్తువులను డిప్యూటీ తహసీల్దార్ నాగమనోహర్‌రెడ్డి, ఆర్ఐ సుదర్శన్ అందించారు. జీవనోపాధి కోసం కువైట్, ఇతర దేశాలకు వెళ్లిన వారు ఆర్‌కే హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ సంస్థ ద్వారా తమ జీతంలో కొంత డబ్బును నిరాశ్రయులకు అందించడం అభినందనీయమన్నారు. మీకోసం సేవా సంస్థ అధ్యక్షుడు విష్ణువర్ధన్, శ్రీపాద శ్రీవల్లభ అక్షయ సేవా సమితి అధ్యక్షుడు కొండల భరద్వాజ రెడ్డి, అమ్మ సేవా సమితి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

యమహా ఎఫ్‌జెడ్–ఎస్‌వీ4 వాహనం ఆవిష్కరణ



కొనుగోలుదారుడికి తాళం అందిస్తున్న మేనేజర్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మైదుకూరు రోడ్డులోని యమహా షోరూంలో యమహావారి ఎఫ్ జెడ్–ఎస్ వర్షన్ 4 ద్విచక్ర వాహనాన్ని శనివారం కంపెనీ ప్రతినిధులు ఖాసీంఖాన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 150 సీసీలో ఈ ద్విచక్రవాహనం మంచి మైలేజీ ఇవ్వడంతోపాటు నడిపేందుకు చాలా అనువుగా ఉంటుందన్నారు. ఈసందర్భంగా కొనుగోలుదారులకు తాళాన్ని అందించారు. కార్యక్రమంలో షోరూం మేనేజర్లు శ్రీనివాస్, పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

మాస్క్ కమిటీ సేవలు అభినందనీయం



రంజాన్‌తోఫా అందజేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బద్వేలు : బద్వేలు మాస్క్ కమిటీ.. పేదలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. శనివారం పోరుమామిళ్లలోని పార్టీ కార్యాలయంలో మాస్క్ కమిటీ అందించిన రంజాన్ తోఫాను ఆయన పేదలకు పంపిణీ చేశారు. 150 మందికి బియ్యం, నిత్యావసరాలు, మరో 100 మందికి బియ్యం, కొంత నగదు అందించారు. ఈ సందర్భంగా బద్వేలు మాస్క్ కమిటీ అధ్యక్షులు అల్లాబకాష్‌ను అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ వైస్‌చైర్మన్ రమణారెడ్డి, బద్వేలు మున్సిపాలిటీ కౌన్సిలర్లు కరిముల్లా, సరిటాల మౌలాలి, ఖాజీసాహెబ్ షఫిఅహ్మద్, సయ్యద్‌బాబు, ఫ్రూట్‌షఫి, సింగిల్‌విండో అధ్యక్షులు సుందర్‌రామిరెడ్డి, పోరుమామిళ్ల వైస్ ఎంపీపీ సి.బాషా, కో ఆప్షన్ సభ్యులు అల్లా, ఎంపీటీసీ ఇషాక్, నాయుడు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం



పశువైద్యశిబిరంలో మందులను అందజేస్తున్న వాటర్‌షెడ్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు

బి.కోడూరు : జిల్లా పశుసంవర్ధకశాఖ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని మూలవారిపల్లెలో ప్రభలవీడు పశువైద్యాధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య ఆధ్వర్యంలో మెగా పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పాల్గొన్న వాటర్‌షెడ్ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డిలు మాట్లాడుతూ పాడి పశువులతో రైతులు మంచి లాభాలు పొందవచ్చని, బి.కోడూరు మండలంలో పశుగణాంకాలు ఎక్కువగా ఉండటం వలన దానిని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి కృషి వలన అదనంగా ప్రభలవీడుకు ఒక పశువైద్యాధికారిని నియమించడం జరిగిందన్నారు. అనంతరం 25 పశువులకు, 750 గొర్రెలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను మాజీ సర్పంచ్ లక్ష్మీనరసారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శివారెడ్డి చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది వంశీ, నాగేంద్ర, బాలయ్య, రవి, నాయకులు వెంకటరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'సై సైరా' నాటక ప్రదర్శన



సైసైరా నరసింహారెడ్డి నాటక ప్రదర్శనలో కళాకారులు

వైవీయూ : తెలుగువారి శౌర్యానికి, దేశభక్తికి ప్రతీక ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని వైవీయూ అధికారులు పేర్కొన్నారు. శనివారం యోగివేమన విశ్వవిద్యాలయంలోని సురభి సమావేశ మందిరంలో తెలుగు నాటకరంగ దినోత్సవం, కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య జింక రంగజనార్ధన, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి మార్గదర్శనంలో లలితకళల విభాగం ఆధ్వర్యంలో సైసైరా నరసింహారెడ్డి నాటకం, ఏకపాత్రాభినయాలు నిర్వహించారు. నాటకం ఆద్యంతం ఆకట్టుకుంది. సైసైరా నరసింహారెడ్డి నాటకంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పాత్రను ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పోషించడంతో పాటు నాటకానికి దర్శకత్వం వహించడం విశేషం. కార్యక్రమంలో వైవీయూ ఆర్ట్స్ విభాగం డీన్ ఆచార్య టి. రామప్రసాద్‌రెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి, లలితకళల విభాగాధిపతి కోట మృత్యుంజయరావు డీఎస్పీ ఎల్. సుధాకర్, ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ చిన్నపరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే జగనన్న లక్ష్యం



బద్వేలు అర్బన్ : ప్రజలకు కరపత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి



బి.కోడూరు : శ్రీరామ్‌నగర్‌లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కాశినాయన : అక్కంపేటలో పథకాలు వివరిస్తున్న ఆదిత్యరెడ్డి, హనుమంతరెడ్డి, నాయకులు

బద్వేలు అర్బన్ : అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి వారిని అభివృద్ధి బాటలో నడిపించడమే లక్ష్యంగా జగనన్న పాలన సాగిస్తున్నారని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 27వ వార్డులో శనివారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికి వెళ్ళి గత ప్రభుత్వ హయాంలో పాలన, ప్రస్తుత హయాంలో పాలన ఏవిధంగా ఉందో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, వార్డు ఇన్‌చార్జి చెన్నక్రిష్ణారెడ్డి, గృహసారధులు, వలంటీర్లు పాల్గొన్నారు.

బి.కోడూరు : వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రజలు సంక్షేమ పథకాల ద్వారా మరింత అభివృద్ధి చెందారని మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని మేకవారిపల్లె పంచాయతీ పరిధిలోని శ్రీరామ్‌నగర్‌లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ లక్ష్మీనరసారెడ్డి, గృహసారధులతో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాజారెడ్డి, ప్రహల్లాదరెడ్డి, రమణారెడ్డి, నారాయణ, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కాశినాయన : జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం సచివాలయాల పరిధిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. శనివారం మండలంలోని అక్కంపేట గ్రామంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ హనుమంతరెడ్డిలు పాల్గొని ఇంటింటికి వెళ్ళి జగనన్న పథకాలు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, నాగిరెడ్డి, సురేష్, నాగసుబ్బారెడ్డి, మారారెడ్డి, ఆదినారాయణ రెడ్డి, చిన్నశేషయ్య, బాలయ్య పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

కాశినాయన : గ్రామాల్లోని ప్రజలు పరిశుభ్రత పాటించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వీరన్న తెలిపారు. శనివారం మండలంలోని కె.ఎన్.కొట్టాల, కొండ్రాజుపల్లె గ్రామాల్లో ఆయన పర్యటించారు. కె.ఎన్.కొట్టాల ఎస్సీకాలనీలో గతంలో నిర్మించిన డ్రైనేజీ కూలిపోవడంతో మురికినీరు వీధుల్లోకి వస్తుందని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ఇళ్లల్లో నీరు బయటికి రాకుండా పరిశుభ్రత పాటించాలన్నారు. జిల్లా అధికారులతో మాట్లాడి నూతనంగా డ్రైనేజీ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సందీప్, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు గురుబ్రహ్మం, భాస్కర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

బద్వేలు అర్బన్ : స్థానిక పోరుమామిళ్ళ రోడ్డులోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో శనివారం నంద్యాల శాంతరామ్ మెడికల్ కళాశాల, వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గుండె పరీక్షల వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో సుమారు 60 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, ఎకో పరీక్షలు నిర్వహించి అందులో వైద్య చికిత్సలు అవసరమైన 15 మందిని గుర్తించి వారికి శాంతరామ్ ఆసుపత్రిలో ఉచిత చికిత్సలు చేయించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ మీనాక్షిరెడ్డి, కార్యదర్శి బ్రహ్మయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ గంజికుంటపుల్లయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి పిచ్చయ్య, ఉపాధ్యక్షులు మాబుసాహెబ్, నరసరాజు, రాఘవరెడ్డి, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులోని విద్యానగర్ సమీపంలో గల రామాలయం వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ప్లాంట్, చలివేంద్రాన్ని మున్సిపల్ వైస్‌చైర్మన్ వై.గోపాలస్వామి, నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షులు బుర్రిరాజాయాదవ్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు సంద్ర శ్రీను యాదవ్, సంటెయ్య, జయరామ్‌యాదవ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రోడ్డులో ..

స్థానిక నెల్లూరురోడ్డులోని కృష్ణమందిరం సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రముఖ ఊపిరితిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ వెంకటసందీప్, నియోజకవర్గ యాదవ సంఘం మాజీ అధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చెన్నయ్య, యాదవ సంఘం నాయకులు సింగరయ్యయాదవ్, సుబ్బరాయుడు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

పోరుమామిళ్ల:పోరుమామిళ్ల సచివాలయం–2ను శనివారం బద్వేలు డివిజన్ జిల్లా ఉప వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ చంద్రహాసరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ ప్రోగ్రామ్ గురించి వివరాలు అడిగారు. మందులు, పరీక్షల గురించి వివరాలు తీసుకున్నారు. వ్యాధి నిరోధక టీకాల గురించి అడిగారు. రోగులకు సక్రమంగా వైద్య చికిత్స, వైద్య సలహాలు అందుతున్నాయా? రోగులకు అందుబాటులో ఉంటున్నారా? వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యవిద్యాధికారి సాధు వెంకటేశ్వర్లు, 104 సిబ్బంది పాల్గొన్నారు.



ఆకట్టుకున్న అగ్నిమాపక విన్యాసాలు



నీటి పైపులతో విన్యాసాలు చేస్తున్న సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా శనివారం ఆర్టీసీ బస్టాండు, శివాలయం సెంటర్లలో నీటి పంపులతో సిబ్బంది చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అగ్నిమాపక శాఖకు చెందిన వివిధ రకాల బ్రాంచ్‌లతో ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనలో లాంగ్ బ్రాంచ్, షార్ట్ బ్రాంచ్, ట్రిపుల్ పర్పస్ నాజిల్, రివాల్వింగ్ బ్రాంచ్ తదితర పరికరాలతో విన్యాసాలు చేశారు. అనంతరం ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. సహాయ అగ్నిమాపక అధికారి రఘునాథ్, సిబ్బంది పాల్గొన్నారు.


అగ్ని ప్రమాదాలపై అవగాహన

మైదుకూరు : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం మైదుకూరులో అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్, పోలీస్ స్టేషన్, ఆర్టీసీ డిపో, కడప రోడ్డులో అగ్నిమాపక కేంద్రం అధికారి శివప్ప ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నిప్పు ఆర్పు యంత్ర పరికరాలతో విన్యాసాలు చేశారు.

బద్వేలు అర్బన్ : అగ్ని ప్రమాదాల నివారణలో ప్రజలకు అవగాహన అవసరమని బద్వేలు ఇన్‌ఛార్జి ఫైర్ ఆఫీసర్ కె.వెంకటసుబ్బయ్య అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా రెండవ రోజైన శనివారం స్థానిక ఆర్టీసీబస్టాండ్‌లో, నాలుగు రోడ్ల కూడలిలో ప్రజలకు, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయిల్ లీకేజీ మంటలను ఎలా ఆదుపు చేయాలి, బహుళ అంతస్తు భవనాల్లో ప్రమాదం సంభవిస్తే ప్రజలను ఎలా కాపాడాలో ప్రయోగాత్మకంగా చేసి చూపించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావు, ఫైర్‌మెన్‌లు తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల: వేసవిలో అగ్నిప్రమాదాలకు అవకాశం అధికమని, ప్రజలు, దుకాణ యజమానులు, రైతులు జాగ్రత్తలు పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని పోరుమామిళ్ల అగ్ని మాపక అధికారి వసంతనాయక్ పేర్కొన్నారు. శనివారం ఆర్టీసీ బస్టాండు వద్ద అగ్నిమాపక సిబ్బందితో వసంతనాయక్ వెళ్లి అక్కడి ప్రజలకు, ప్రయాణికులకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. సిబ్బంది విన్యాసాలు చేశారు. కరపత్రాలు పంపిణీ చేశారు.

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలి



ప్రచార భేరి పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

ప్రొద్దుటూరు : రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా దగా చేసిన బీజేపీని గద్దె దింపాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య పిలుపునిచ్చారు. స్థానిక పుట్టపర్తి సర్కిల్‌లో శనివారం మోదీని గద్దె దింపండి – దేశాన్ని కాపాడండి, కేంద్ర బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేకక, నిరంకుశ విధానాలపై ప్రచార భేరి పోస్టర్లను సీపీఐ, సీపీఎం నాయకులు విడుదల చేశారు. బి.రామయ్య మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటు పరం చేస్తుంటే వైఎస్సార్‌సీపీ ఎంపీలు మౌనీ ముద్ర పాటించి బీజేపీకి మద్దతు ప్రకటించారన్నారు. రాష్ట్రానికి బుందేల్ ఖండ్ ప్యాకేజీ ఇస్తామన్న బీజేపీ నేడు రాష్ట్రానికి చిల్లి గవ్వ ఇవ్వలేదని మండిపడ్డారు.ఫెడరల్ స్ఫూర్తిని కాపాడుకోవాలంటే అన్ని వర్గాల ప్రజలు ఏకమై మోదీని గద్దె దింపాలని కోరారు. సీపీఐ ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు, సహాయ కార్యదర్శి షరీఫ్, యేసోబ్, చంద్రశేఖర్, ప్రతాప్, మీరా వలి, ఏఐవైఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

19న సమావేశం

కడప రూరల్: తిరుపతిలో ఈ నెల 19న వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధికార ప్రతినిధి చిన్న సుబ్బయ్య యాదవ్ తెలిపారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి నిర్వహించే ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

'98' డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలి

కడప ఎడ్యుకేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటన ప్రకారం డీఎస్సీ 98 అభ్యర్థులందరికి ఉద్యోగాలను ఇవ్వాలని 98–డీఎస్సీ అభ్యర్థులు చంద్రమౌళి, చంద్రశేఖర్‌రెడ్డి, వాసు విన్నవించారు. ఈ విషయమై శనివారం వారు కడప డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డిని తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోస్టర్ పద్ధతి ప్రకారం పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులకు పోస్టింగ్ ఇవ్వలేదని, ఆర్డర్ ఆఫ్ మెరిట్ వల్ల ఎస్సీ, బీసీలకు అన్యాయం జరిగిందన్నారు. అభ్యర్థులు వెంకటేష్, కోటేశ్వరరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు 6వ మహాసభలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలోని బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయంలో ఆదివారం బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ 6వ జిల్లా మహా సభలను నిర్వహించనున్నట్లు ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ డాట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనంతపురం బీఎస్ఎన్ఎల్ టెలికాం మేనేజర్ షేక్ ముజీబ్ పాషా, జనరల్ మేనేజర్లు హాజరుకానున్నట్లు వివరించారు. బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు పాల్గొని సభలను జయప్రదం చేయాలని కోరారు.